క్లుప్తంగా

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మండల కేంద్రంలో రాస్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కార్వేటినగరానికి చెందిన రవి, మధు దంపతులు పెరటాసి నెల రెండో శనివారాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రతి ఏడాది పెరటాసి నెల శనివారాల్లో వృద్ధులకు అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో నితిన్‌రెడ్డి, భవిత, రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు: సమాజంలోని అసమానతలపై రాజీలేని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి కొనియాడారు. శనివారం కళాశాలలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాషువా దళిత కుటుంబంలో జన్మించి అంటరానితనం అనే దురాచారంతో అనేక బాధలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి వెంకటేశన్, అధ్యాపకులు నరసింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ వినియోగంపై అవగాహన



జీఎస్టీ వినియోగంపై అవగాహన కార్యక్రమం

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జీఎస్టీకి సంబంధించి నోడల్ ఆఫీసర్ సుమతి, ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీకి సంబంధించి తీసు కున్న నిర్ణయం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ అంశాలకు సంబంధించి నాలుగు వారాల పాటు గ్రామ సచివాలయాల పరిధిలో ప్రచారం చేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశంలో ఏఓ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుమార్



నియామకపత్రం అందుకుంటున్న కుమార్

నగరి: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ మీడియా ఆర్గనైజింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జస్బీర్ ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నగరి పట్టణానికి చెందిన కుమార్ నియమితులయ్యారు. శనివారం హ్యూమన్‌రైట్స్ నగరి బ్రాంచ్ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సలీమ్ కుమార్ నియామకాన్ని ధ్రువీకరిస్తూ నియామకపత్రాన్ని, గుర్తింపు కార్డును అందజేశారు.

పంటల బీమాకు మంగళం

దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు(ఫైల్)



- ప్రీమియం భారంతో చాలా మంది రైతులు బీమాకు దూరం
- రైతులకు అండగా నిలిచిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- పంట నష్టపోయినా పరిహారం అందేది శూన్యం
- కూటమి సర్కారు తీరుపై మండిపడుతున్న రైతులు

ఎన్నికల ముందు తాము రైతు పక్షపాతులమని డప్పు వాయించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మొండి చెయ్యి చూపింది. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. వైఎస్సార్ సీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులు నష్టపరిహారం కూడా అందుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకంపై చేతులెత్తేసింది. రైతులే బీమా ప్రీమియం చెల్లించాలంటూ నిబంధన పెట్టింది. కూటమి ప్రభుమి ప్రభుత్వంలో అప్పులు తప్ప ఆదాయం రావడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు 9 గంటల ఉచిత కరెంటు అంటూ విపరీతంగా కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. –పాలసముద్రం

తుపాను, భారీ వర్షాలు, వరదలతో నష్టాలు వాటిల్లినపుడు ప్రభుత్వం పరిశీలించి పరిహారం అందుకోవడానికి పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతోంది. పంట విలువ అంచనా వేసి బీమా కంపెనీలు రైతులకు నష్టపరిహారం అందిస్తాయి. రైతులు పంటలపై బ్యాంకు రుణాలు తీసుకుంటే బ్యాంకు అధికారులే బీమా ప్రీమియం చెల్లిస్తారు. పంటల బీమా సకాలంలో చెల్లించకపోతే విపత్తు సమయంలో పంటలు నష్టపోయినా నష్ట పరిహారం అందదు.

గతంలో ఇదీ విధానం

రైతులపై ప్రీమియం భారం పడకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ క్రాప్ చేసుకున్న రైతులందరికీ ప్రీమియం మొత్తాన్ని చెల్లించి ఆదుకుంది. దీని వల్ల రైతులకు బీమా ప్రీమియం చెల్లించే పని పని లేకుండా పోయింది. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులతోపాటు కౌలు రైతులకు కూడా పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ప్రభుత్వం మండల పరిధిలో పంట నష్టపోయిన సుమారు13885 మంది రైతులకు సకాలంలో రూ 9.12 కోట్లు వారి ఖాతాలకు నేరుగా పరిహారం చెల్లించి అందుకుంది.

డిసెంబర్ 15 చివరి గడువు

మండల పరిధిలో సీజనల్ సుమారు 5600 ఎకరాల్లో వేరుశనగ, చెరకు, వరి, సాగవుతున్నాయి. బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వం డిసెంబర్ 15వ తేదీ వరకు గడువు విధించింది. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు పంటలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో వేరుశనగ, వరి, పప్పు, జొన్న, ఉల్లి పంటలను చేర్చింది.

పంట		చెల్లించాల్సిన ప్రీమియం ఎకరాకు..
వరి	-	రూ 630
మినుము	-	రూ 285
పెసర	-	రూ 270
నువ్వులు	-	రూ 180
వేరుశనగ	-	రూ 480
ప్రొద్దుతిరుగుడు	-	రూ 300
టమాట	-	రూ 1500
జొన్న	-	రూ 297

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత బీమా పథకాన్ని కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా ప్రీమియం చెల్లించాలనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం అందజేయాలి.

–రవిరెడ్డి, కేజే పురం, రైతు

పంట బీమా రద్దు అన్యాయం



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే రైతులను దెబ్బతీస్తోంది. రబీసాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింపజేయాలి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బ తింటే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి ఉండదు. ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. బీమా ప్రీమియం చెల్లించాలంటే భారంగా ఉంది. ఇప్పటికే అప్పులు చేసి రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్నాం.

–కె.రాజేంద్రన్, శ్రీకావేరిరాజుపురం, రైతు

ప్రీమియం చెల్లించిన వారికే బీమా



పంటల బీమా వర్తించాలంటే ప్రీమియం రైతులే చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటైతే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్నా పరిహారం పొందే వీలుంటుంది. నిర్దేశించిన గడువులోగా ప్రతి రైతు ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిస్తుంది.

–ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి, పాలసముద్రం

గొయ్యి ఉంది.. జాగ్రత్త



లీకేజీ ప్రాంతంలో నీటితో నిండిన గొయ్యి

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట, ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రోడ్డులో పైపు లీకేజి స్థానికులకు లేనిపోని తంటాలు తెచ్చిపెడుతోంది. పైపు లీకేజీని సరిచేయడానికి మున్సిపల్ సిబ్బంది నాలుగు రోజుల క్రితం నాలుగు అడుగుల మేర గొయ్యి తవ్వారు. పనులు పూర్తిచేయడంలో వేగం చూపకపోవడంతో లీకేజీ నీరు ఆ గొయ్యి మొత్తం నిండి రోడ్డుపై పారుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఈ ప్రాంతాల్లో ఆడుకుంటూ ఉంటారని, ప్రమాదవశాత్తు అందులో పడితే పెనుప్రమాదం జరిగే ఆస్కారం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. త్వరగా లీకేజీని సరిచేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మత్తుమయం



దుకాణం ముందు పడి ఉన్న మందుబాబు

నగరి: యువత మత్తులో తూగుతోంది. ఊరికి దూరంగా ఉన్న మద్యం షాపులు ప్రభుత్వం పుణ్యమా అంటూ అత్యంత సమీపంగా అందుబాటులోకి రావడంతో ఫుల్లుగా లాగించేస్తున్నారు. తామెక్కడున్నామో, ఏం చేస్తున్నామో తెలియని ఊహాలోకానికి వెళ్లిపోతున్నారు. దుకాణాల ముందు, రోడ్డుపక్కన పడి ఉన్న వీరిని చూసి రోడ్డున వెళ్లే వారు ఛీదరించుకుంటున్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై పవన్ స్పందించాలి

- అసెంబ్లీలో చిరంజీవిని అవమానిస్తే నోరు మెదపడం లేదు



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: మెగాస్టార్ చిరంజీవిపై అసెంబ్లీలో సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో మాజీ కేంద్రమంత్రి చిరంజీవిని విమర్శిస్తే సొంత తమ్ముడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఆయన విమర్శించారు. సినీ నటుడు బాలకృష్ణకు మెంటల్ ఉందని, ఈ విషయమై తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మతిస్థిమితం లేదని డాక్టర్ల వద్ద ఆయన సర్టిఫికెట్ తెచ్చున్నారన్నారు. అలాంటి వ్యక్తి అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా చిరంజీవిని అవమానించారని పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి బాలకృష్ణ మాట్లాడడం దారుణమన్నారు. దగ్గరికొచ్చిన అభిమానులను కొట్టడం ఫోన్లో తిట్టడం లాంటి ఛండాలమైన సంస్కృతి బాలకృష్ణదేనని విమర్శించారు. ఇప్పటికైనా నోటిని అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వేడుకగా గ్రామోత్సవం

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తమిళ పెరటాసి నెల రెండవ శనివారం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కై ంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి తిరుచ్చిపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

ఆర్గానిక్ కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం



ఆర్గానిక్ కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు వినియోగించడంతో ఆరోగ్యం చేకూరుతోందని, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ కూరగాయల అమ్మక కేంద్రంలో డ్వాక్రా మహిళలు పండించిన ప్రకృతి కూరగాయల అమ్మకాలను ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం కల్పలత రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమ, శనివారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం, ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఆర్గానిక్ కూరగాయలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇలాంటి కూరగాయలను తీసుకోవడంతో పోషకాహారం, ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సాగులో చేసిన కూరగాయలకు విక్రయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు మునెమ్మ, నిర్మల, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కిలో రూ.10కే వర్మీకంపోస్టు విక్రయం

తవణంపల్లె: మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీ చెత్తసేకరణ కేంద్రంలో తయారయ్యే వర్మీ కంపోస్టు ఎరువును రైతులకు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ ఎంపీడీఓ మురుగేషన్ తెలిపారు. అరగొండ పంచాయతీ చెత్తసేకరణ కేంద్రంలో రెండు టన్నుల వర్మీకంపోస్టు ఎరువు ఉందన్నారు. అవసరమైన రైతులు అరగొండ చెత్త సేకరణ కేంద్రంలో కిలో రూ.10లకు ఎరువులను కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రీసర్వే పనులు వేగవంతం



మాట్లాడుతున్న తహశీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు రీ సర్వే పనులు పూర్తి చేయాలని తహశీల్దార్ అరుణ కుమారి శనివారం రెవెన్యూ కార్యాలయంలో రీసర్వే పనులపై గ్రామ సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పూర్తి చేసిన సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రిషివర్మ, ఆర్‌ఐ దేవి, వీఆర్‌ఓలు శ్రీనివాసులు, తంగరాజ్. రమణయ్య. రమేష్, వెంకటాచలం, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

డ్రిప్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి



డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఐఏఓ జయచంద్రారెడ్డి

కార్వేటినగరం: రాయితీపై అందించే డ్రిప్ సౌకర్యాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఏఓ జయచంద్రారెడ్డి అన్నారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని పద్మసరస్సు ఎస్టీ కాలనీలో డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఐఏఓ మాట్లాడుతూ నీటి సౌకర్యం ఉన్న ప్రతి రైతు డ్రిప్ ఏర్పాటుకు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరా నుంచి 5 ఎకరాల వరకు వంద శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. అలాగే 5 ఎకరాలకు పైగా ఉన్న రైతులకు 90 శాతం రాయితీ వర్తిస్తుందని, ఆసక్తి కలిగిన రైతులు తమ కుల ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఒన్‌బీ ఒరిజినల్, భూమి పాస్ పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, ఎఫ్‌ఎంబీ స్కెచ్ సమర్పించాలన్నారు. అలాగే ఓబీసీ రైతులకు 90 శాతం రాయితీపై 10 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గతంలో డ్రిప్ తీసుకుని 7 సంవత్సరాలు పూర్తి అయిన రైతులు మళ్లీ డ్రిప్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 79950 10012 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు హేమాద్రి, గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలు తప్పనిసరి

తవణంపల్లె: ప్రజలు అప్రమత్తమై ముందస్తుగా పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ వ్యాధిని సులభంగా నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. శనివారం మండలంలోని ద్వారకాపురంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. సీజనల్‌గా లభించే పండ్లు, ఆకుకూరలు, అధికంగా తినాలని సూచించారు. అనంతరం రోగులకు, మహిళలకు, బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌వేలు, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

లోకపావని.. నమోస్తుతే



శ్రీరంగరాజపురంలో..., అన్నపూర్ణేశ్వరి దేవిగా అల్లియల్లమ్మ, వెదురుకుప్పం: లలితత్రిపుర సుందరి, సరస్వతిగా దేశమ్మ, కాత్యాయనిగా అన్నపూర్ణేశ్వరి, పుత్తూరు: పార్వతీదేవి



కరియాణిక్యస్వామి ఆలయం వద్ద అన్నదానం, కరివరదరాజ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో శనివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి నారాయణి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అర్చకులు దుర్గాప్రకాష్ మంత్రోచ్చారణ నడుమ బ్రాహ్మణ సంఘ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ అర్చన చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో టీటీడీ ఆధీనంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి కాత్యాయని అలంకారం చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయాన్ని వేపాకులు, పూలదండలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని వేణుగోపాలపురం పంచాయతీ సుపర్వరాజపురం బీసీకాలనీలో వెలసిన శ్రీమూర్తి అమ్మవారి దసరా నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున అర్చనలు, అభిషేకాలు చేశారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: శ్రీఅల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఐదవరోజు అన్నపూర్ణేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల, ఉత్సవ మూర్తులకు అర్చకుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ మాడవీధులలో అమ్మవారి అన్నపూర్ణేశ్వరి అలంకారంలో ఉత్సవ విగ్రహాన్ని పంబ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా గంగాధరనెల్లూరు దిగవూరుకు చెందిన శ్రీరాములరెడ్డి, సరస్వతి దంపతులు వ్యవహరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాజరాజేశ్వరి దేవి లలిత త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు అభయమిచ్చారు.

నయనానందకరంగా నవరాత్రులు

పుత్తూరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. కామాక్షీదేవిని వారాహి మాతగా, ఆరేటమ్మ మహిషాసుర మర్దినిగా, ద్రౌపదీదేవి పార్వతీదేవి శివపూజ అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు.

గాయత్రీదేవి అలంకరణలో బంగారమ్మ

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం శ్రీబంగారమ్మ గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులైన నవీన, శ్రీనివాస దినేష్ కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై భక్తులు పాల్గొన్నారు.

బాట గంగమ్మ ఆలయంలో..

మేజర్ పంచాయతీ కార్వేటినగరం సంత గేటు సమీపంలో వెలసి ఉన్న శ్రీబాట గంగమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా శనివారం అమ్మవారు గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా పెరటాశి శనివారం పూజలు

నగరి: గోవింద భక్తులకు ప్రత్యేకమైన పెరటాశి నెల శనివారం పూజలను నగరి పట్టణ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీభూదేవి, శ్రీదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో, సత్రవాడ శ్రీభూనీలా సమేత కరివరదాజ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్యూలైన్లలో వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కరియమాణిక్య స్వామి ఆలయంలో సాయంత్రం నిర్వహించిన ఊంజల్‌సేవ కార్యక్రమం భక్తులకు నేత్రపర్వంగా నిలిచింది. ఆలయ అధికారి వెంకటరమణ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయాల వద్ద దాతలు భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పెరటాశి నెల శనివారంను పురస్కరించుకొని పాదయాత్ర చేసే గోవింద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మధు, సుబ్రమణ్యం, నాగరాజు, చిట్టి, నిరంజన్ రెడ్డి, మహేష్, శీను, శశికుమార్, సురేష్, రామన్, శివ తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ



గాజులపల్లెలో అవగాహన ర్యాలీ

తవణంపల్లె: ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గాజులపల్లెలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే గుండె వ్యాధులపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 29వ తేదీన ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ముందస్తుగా అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లోకేశ్వరి పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. గాజులపల్లె పురవీధుల్లో ర్యాలీ చేస్తూ ఆరోగ్యకరమైన గుండె సంతోషకరమైన జీవితం, మన హృదయం మన బాధ్యత, హృదయం బలంగా ఉంటే జీవితంలో వెలుగులు ఉంటాయని నినాదాలు చేశారు. అనంతరం గాజులపల్లెలోని కూడలి ప్రాంతంలో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, ప్రోగ్రాం అధికారి మౌనిక, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.